క్లుప్తంగా

దళితులకు రక్షణ కల్పించండి



ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కడప అర్బన్ : కడప ఇందిరానగర్‌లోని దళితులకు అగ్రవర్ణాల నుంచి రక్షణ కల్పించాలని దళిత ఫోరం కన్వీనర్ బూషిపాటి కిశోర్ డిమాండ్ చేశారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను శనివారం దళిత సంఘాల నాయకులతోపాటు ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. కిశోర్ మాట్లాడుతూ ఇందిరానగర్ నడివీధి గంగమ్మ ఆలయం నిర్మించుకొని, పక్కనే టీ స్టాల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్న పల్లం చంద్రయ్యను అక్కడి నుంచి వెళ్లిపోవాలని అగ్రవర్ణాలకు చెందిన కొందరు బెదిరింపులకు దిగారన్నారు. ఆలయం పక్కన ఎస్సీ, ఎస్టీ బీసీ పేద వర్గాలు కూర్చోవడం సహించలేక ఇలాంటి కుట్రలకు తెరలేపారని వారు ఎస్పీ దృష్టికి తెచ్చారు. నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి సమస్య తీసుకువెళ్లామని, తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పల్లం చంద్రయ్య, సంగటి మనోహర్, సుబ్బరామయ్య, శ్యాంసన్, లక్ష్మోన్నరాయణ, మోహన్, గిద్దలూరు బాబు, ఆవుల మోహన్, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రాణాలర్పించిన జవాన్‌కు జోహార్లు



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఖాదర్‌బాషా, తదితరులు

కడప ఎడ్యుకేషన్ : దేశ రక్షణలో ప్రాణాలర్పించిన వీర జవాన్ మురళీ నాయక్‌కు జోహార్లు అని జెకె క్రీడా సాంస్కృతిక విద్యాభివృద్ధి రాష్ట్ర అధ్యక్షుడు లయన్ పటాన్ ఖాదర్‌బాషా అన్నారు. కడప గౌస్ నగర్‌లో మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి జిల్లాకు చెందిన మురళీ నాయక్ పాకిస్తాన్, భారత్ సరిహద్దులో ప్రాణాలు కోల్పోవడం విషాదకరం అన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తారీఖలి, షేక్ సమీ, అమానుల్లా షేక్, సొహేల్, తదితరులు పాల్గొన్నారు.

మన సైన్యం సత్తా ఏంటో ప్రపంచానికి తెలిసింది

కడప ఎడ్యుకేషన్ : ఆపరేషన్ సింధూర్‌లో భారత సైన్యం యొక్క సత్తా ఏమిటో ప్రపంచానికి తెలిసిందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఇండియా పాకిస్తాన్ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరగడం సంతోషకరమని చెప్పారు. యుద్ధంతో ఇరు దేశాలకు అన్ని విధాలా నష్టం వాటిల్లుతుందని, ఈ విషయంలో ప్రధాని నరేంద్రమోదీ వ్యూహాత్మకంగా వ్యవహరించారని కొనియాడారు. ఉగ్రవాదంపై పోరుకు ఎప్పటికీ ప్రజలు మద్దతుగా నిలుస్తారన్నారు.

అమ్మను మించిన దైవం లేదు

కడప ఎడ్యుకేషన్ : ఇంట్లో అమ్మను మించిన దైవం లేదని కొండ పాలకొండయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొండసుబ్బయ్య అన్నారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని కడప హబీబుల్లా వీధిలోని అల్లా బకాష్ కార్యాలయంలో శనివారం మదర్స్‌డే ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అమ్మను దైవంలా పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెనుబల శ్రీనివాసులు, అబ్దుల్ రాయల్ కరీముల్లా, రుక్మిణమ్మ, డాక్టర్ అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



తనిఖీలు చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప అర్బన్: రోడ్డు భద్రతపై వాహనదారులు అవగాహన కలిగి ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ల పరిధిలోని విద్యార్థులు, యువతకు, డ్రైవర్లకు శనివారం విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం తాగి సేవించి వాహనం నడపడం, సీటు బెల్టు ఉపయోగించకపోవడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని పోలీసులు సూచించారు. మైనర్లకు వాహనం ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు.

కడపలో డీఎస్పీ తనిఖీలు

కడప నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు, పటిష్ట బందోబస్తు మధ్య ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను ఆరా తీశారు, సీఐలు జావిద్, నాగార్జున పాల్గొన్నారు.

సెలవుల కాలం.. జరభద్రం!

వేసవి సెలవులు వచ్చేశాయి. బడులన్నీ నిశ్శబ్దమైపోయి సందడంతా ఇంటి గడపలకు చేరింది. సెలవు రోజుల్లో బొలెడు ప్లాన్స్ పెట్టుకుంటారు. సరదాగా గడుపుతామనే పిల్లలను అజాగ్రత్తతో ప్రమాదాలు కొనితెచ్చుకుంటారు. వారిని తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టుకోవాలి. ఎప్పుడూ తగిన సూచనలు, సలహాలిచ్చి అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది.



కేసీ కాలువలో ఈత కొడుతున్న చిన్నారులు

- ప్రమాదాలకు ఆనవాళ్లుగా నదులు, చెరువులు
- సెల్ ఫోన్‌కు పిల్లలను దూరంగా ఉంచాలి
- చెప్పకుండా బయటకు వెళ్తే.. ఓ కంట కనిపెట్టాలి

కడప ఎడ్యుకేషన్ : ఒక్క పక్క ఎండలు.. మరో పక్క ఉక్కపోత.. ఇంకేముంది నీరు కలిపిస్తే చాలా పిల్లలకు ఎక్కడ లేని ఉల్లాసం ఉరకలేస్తుంది. నీటిని చూడగానే పట్ట పగ్గాలుండవు. ఈ ఉల్లాసంలో నీటి మడుగులు, బావులు, చెరువుల ఎంత లోతున్నాయే ఆలోచించరు. ఈత వచ్చిన వారితోపాటు.. రాని వారు కూడా సరదగా దిగి ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ నెల 8న పులివెందులలో ఇంజినీరింగ్ విద్యార్థి నాదెండ్ల అన్వర్ స్నేహితులతో కలిసి సరదాగా కాల్వకు ఈతకు వెళ్లి మృత్యువాతపడ్డాడు. దీంతో ఇంటిల్లిపాదికీ కడుపుకోత మిగిలింది. చెరువులు, కాలువలు వంటి వాటికి ఈతరాని వారిని దూరంగా ఉంచాలి.

సెల్ ఫోన్ వద్దే వద్దు..

చిన్న పిల్లలకు చేతిలోకి సెల్ ఫోన్ వచ్చిందంటే ఒళ్లు, ఇళ్లు మరిచిపోయి ఎన్ని గంటలైనా గడిపేస్తుంటారు. పాఠశాల సెలవు రోజుల్లో ఫోన్‌కు దూరంగా ఉంచాలి. చాలామంది తల్లిదండ్రులు.. తమ పిల్లలు అల్లరి చేయరాదనే ఉద్దేశ్యంతో సెల్ ఫోన్ పిల్లలకు ఇస్తుంటారు. మొదట్లో బాగానే ఉన్నా కొన్ని రోజులకు పిల్లలు వారు బానిసలుగా మారిపోతారు. ఆ తర్వాత ఫోన్ లేకుంటే ఉండలేని స్థితికి వచ్చేస్తారు. తమ పిల్లలతో తల్లిదండ్రులు ఎక్కువ సమయం సరదాగా గడపాలి.

స్నేహితులతో బయటికి పంపిస్తే..

పిల్లలను ఆడుకొనేందుకు స్నేహితులతో బయటికి పంపిస్తే ఎవరితో వెళ్తున్నారు. ఎక్కడికి వెళ్తున్నారో ఓ కంట కనిపెడుతూ ఉండాలి. వంకలు, వాగులు, బావులు కనిపించగానే పిల్లలతో సరదాగా దిగేస్తారు. పొరపాటు జరిగితే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. వేడికి తట్టుకోలేక విష పురుగులు బొరియల నుంచి వచ్చి చల్లటి ప్రాంతాల్లో సంచరిస్తూ ఉంటాయి. అప్రమత్తంగా లేకుంటే ప్రాణాలను బలి తీసుకుని జీవితాంతం తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలిస్తాయి.

ఎండలతో అప్రమత్తం



ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో బయట తిరిగితే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్ ఆటలలో మునిగి తేలుతుంటారు. 40 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండడంతో వారు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. ఉదయం 9 గంటలకే ఆట ముగించుకుని ఇంటికి తెచ్చుకోవాలి. సాయంత్రం ఐదు గంటలకు పైన బయటకు తీసుకెళ్లాలి. ఎవరికైనా తల నొప్పి, ఒంటినొప్పి లక్షణాలు కనిపిస్తే తడిగుడ్డ కప్పి మజ్జిగ, పండ్ల జ్యూస్, గ్లూకోజ్ ఇచ్చి విశ్రాంతి తీసుకోవాలి. అప్పటికి తగ్గకపోతే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్.యస్.మహబూబ్ అలీ, ఫిజీషియన్, కడప

సెలవును వృథా చేసుకోవద్దు



వేసవి సెలవులను వృథా చేసుకోవద్దు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో సరదాగా గేమ్స్‌లో శిక్షణ పొందడం, స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ తీసుకోవడం వంటివి చేయాలి. ఎండ తీవ్రత తగ్గాక సాయంత్రం పాటలతో ఎంజాయ్ చేయాలి. సెలవులను వృథా చేయకుండా గ్రంథాలయాలకు వెళ్లి పత్రికలు, మ్యాగజైన్స్, విజ్ఞాన పుస్తకాలు చదివించే అలవాటు చేయాలి. సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలి.

– షేక్ షంషుద్దీన్, డీఈఓ, వైఎస్సార్ జిల్లా

కడప రాయుని కోనేటి విహారం



శ్రీకృష్ణ, గోదాదేవిగా మంగళ మూర్తులు



తెప్పోత్సవంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : మండుతున్న ఎండలతో ఉక్కపోత. సాయంత్రం చల్లగాలికి సేద తీరాలనిపించే వాతావరణంలో కడప రాయుడు లక్ష్మీ, వేంకటేశ్వరుడు తెప్పపై శ్రీకృష్ణ, దేవేరి ఆండాళ్ తాయారు (గోదాదేవి)తో కలిసి విహరించారు. దేవునికడప ఆలయంలో తెప్పోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజున సాయంత్రం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం చేసి పల్లకిలో కొలువుదీర్చారు. అర్చకులు కృష్ణ మోహన్, మయూరం తివిక్రమ్ బృందం వేదమంత్రోచ్ఛాటన మధ్య తిరువీధి ఉత్సవం నిర్వహించారు. పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి పుష్కరిణిలోని తెప్పలో కొలువుదీర్చారు. పూజల అనంతరం మంగళహారతి ఇచ్చి తెప్ప పుష్కరిణిలో తొలి ప్రదక్షిణ చేయించారు. రెండోమారు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు గాయకులు భక్తిగీతాలాపనతో తెప్పతో ప్రదక్షిణ నిర్వహించారు. మూడోమారు స్వామి, అమ్మవారు మంగళ వాయిద్యాల మధ్య ప్రదక్షిణ చేశారు. మంగళ హారతులు అనంతరం స్వామి, అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు.

ఉత్సవ కళ

తెప్పోత్సవం సందర్భంగా పుష్కరిణి చుట్టూ రంగు రంగుల విద్యుద్దీపాలు అలంకరించారు. అలంకార మండపానికి రంగుల పందిళ్లు వేశారు. స్వామి పుష్కరిణిలో విహరిస్తుండగా భక్తులు గోవింద నామ స్మరణలతో తన్మయులయ్యారు. ఆదివారం రెండవరోజు తెప్పోత్సవం నిర్వహించనున్నారు.

గేసుదరాజ్ బందనవాజ్ దర్గాలో ఉరుసు



గేసుదరాజ్ బందనవాజ్ దర్గా

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం అల్మాస్‌పేట సర్కిల్‌లోని గేసుదరాజ్ బందనవాజ్ దర్గాలో కొలువైన హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అమినుద్దీన్ హుసేని ఖుదససిర్రహు ఉరుసు మహోత్సవం సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం కడప అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా మహ్మద్ హుసేనీ సాహెబ్ గంధాన్ని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారన్నారు. మంగళవారం ఉరుసు జరుగుతుందన్నారు. రాత్రి ప్రముఖ గాయకులచే ఖవాలీ కచేరీ ఉంటుందని, బుధవారం సాయత్రం 5 గంటలకు తహలీల్ ఫాతెహాతో ఉత్సవాలు ముగుస్తాయని వారు వివరించారు.

అగ్నివీర్ నియామకాల్లో నిబంధనలు వద్దు



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : దేశంలో యుద్ధ వాతావరణం నెలకొనడం, అమాయకుల ప్రాణాలు కోల్పోవడానికి కారణం భద్రత ఏర్పాట్లు సక్రమంగా లేకపోవడమేనని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి అన్నారు. నగరంలోని ఇందిరాభవన్‌లో సింధూర్‌లో అమరులైన మురళీనాయక్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఆర్మీలో చేరేందుకు ఉత్సాహం చూపకపోవడంతో సైనికుల కొరత ఉందని అన్నారు. మే నెలలో జరగాల్సిన 40 రోజుల కార్యక్రమాలు రద్దు అయినట్లు తెలిపారు. ఈ నెల 12న కడప జిల్లాలో వైఎస్.షర్మిలారెడ్డి పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో అశోక్‌రెడ్డి, పటాన్ మహమ్మద్ అలీఖాన్, రఫీక్ ఖాన్, సిరాజుద్దీన్, సయ్యద్ గౌస్‌పీర్, సుశీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : స్వచ్ఛ భారత్–స్వచ్ఛాంధ్ర పేరుతో వందల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించకుండా శ్రమ దోపిడీ చేస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు జి.వేణుగోపాల్, స్వచ్ఛ భారత్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ. బాదుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని హోచిమిన్ భవన్‌లో స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెలా 5వ తేదీలోపు వారికి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుమారు 4 నెలల నుంచి ఆరు నెలల వరకూ కార్మికులకు వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. జీతాలు సకాలంలో రాక, కొత్త అప్పులు పుట్టక కిరాణా దుకాణ యజమానుల ఒత్తిళ్లు, వడ్డీ వ్యాపారుల వేధింపులతో కార్మికులు అవస్థపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులను అడిగితే ''మేము ఇచ్చినప్పుడు తీసుకోండి' అంటూ బెదిరిస్తున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే కార్మికులను అందలమెక్కిస్తామని కూటమి ప్రభుత్వ వాగ్దానాలు అమలు చేయడం లేదన్నారు. ఈ సమావేశంలో హనుమంతు, ఆంజనేయులు, ఆనందయ్య, లక్ష్మయ్య, సుధాకర్, కళ్యాణ్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

• చల్లదనానికి పాట్లు





కడప నగరంలో పగటి ఉష్ణగ్రతలు రోజు రోజుకూ ఎక్కువ కావడంతో చల్లదనానికి పేద, మధ్య తరగతి వారు వాటర్‌కూలర్లు కొనేస్తున్నారు. కడపలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండలు ఎక్కువగా ఉండడంతో కూలర్లు కొనేవారు ఎక్కువగా కనిపిస్తున్నారు. నగరం లోని మద్రాసు రోడ్డులో కూలర్లను తీసుకువెళుతున్న దృశ్యాలు ఇవీ..

• ప్రకృతి రమణీయం



కడప నుంచి అన్నమయ్య జిల్లా రాయచోటికి వెళ్లే మార్గంలో వేకువ జామున గువ్వల చెరువు ఘాట్ వద్ద ఈ ప్రకృతి రమణీయ దృశ్యాలు కనువిందు చేశాయి. వాటిని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

శిలాఫలకాలు శిథిలం



రాజీవ్ పార్కులో మట్టిపాలైన శిలాఫలకాలు

కడప కార్పొరేషన్ : రాజీవ్ పార్కులో శిలా ఫలకాలు శిథిలమయ్యాయి. కడప నగరంలో సుమారు రూ.110 కోట్లతో 2023 జూలై, 10న నాటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి రాజీవ్ పార్కు వద్ద వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. వాటిలో చాలా పనులు పూర్తవగా, కొన్ని మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. అభివృద్ధి పనులు జరిగిన చోట శిలాఫలకాలు ఏర్పాటుచేయాల్సిన అధికారులు ఇలా...రాజీవ్ పార్కులో వదిలేసి వెళ్లారు. కొన్ని మట్టిపాలవగా.. మరిన్ని పగిలిపోయే స్థితిలో ఉన్నాయి. కడప నగరానికి రూపాయి నిధులు ఇవ్వని కూటమి ప్రభుత్వం ఇచ్చిన నిధులతో తయారుచేసిన సామగ్రి ఇలా వదిలేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పుట్లంపల్లె లేక్ రెజువనేషన్ పనులకు సంబంధించి రూ.15 కోట్లు, సీవరేజ్ అండ్ సెప్టిక్ మేనేజ్‌మెంట్ కోసం రూ.50.22 కోట్లు, నగరపాలక సంస్థ నూతన కార్యాలయ భవనానికి రూ.31.17కోట్లు, రాజీవ్‌పార్కు రోడ్డు రూ.5.61కోట్లు, రాజీవ్ పార్కు రూ.1.37కోట్లు గత ప్రభుత్వం కేటాయించింది. ఇందులో పుట్లంపల్లె లేక్, సీవరేజ్ అండ్ సెప్టిక్ మేనేజ్‌మెంట్(అమృత్ 2.0) పనులు పూర్తయ్యాయి.

లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలకు శ్రీకారం

రాజంపేట రూరల్ : ఉమ్మడి జిల్లాలలో ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న భువనగిరిపల్లి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు దేవస్థాన కమిటి నిర్వాహకులు శనివారం శ్రీకారం చుట్టారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వేకువ జామున నుంచి స్వామి వారికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి దేవస్థాన ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని కొండపై నుంచి భువనగిరిపల్లిలో ఊరేగించారు.

నేటి నుంచి ప్రత్యేక పూజలు

పెనగలూరు: పెనగలూరు మండలం, ఈటమాపురం గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు వైస్ చైర్మన్ బత్తిన గుండాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవ, 6 గంటలకు అభిషేకం జరుగుతుందని, సాయంత్రం ఏడు గంటలకు బత్తిన గుండాల్ రెడ్డి సతీమణి మహేశ్వరీలు స్వామివారికి పట్టు వస్త్రాలు, బంగారు మాంగల్యాలు, వెండి వస్తువులు ఆలయ మర్యాదలతో స్వామివారికి 8 గంటలకు నాయుడువారిపల్లి, తూర్పుపల్లి, చెంచువారు చెంచు లక్ష్మీకి సాంగెము తీసుకురావడం ఆనవాయితీ. ఏడు గంటల నుంచి ఈటమాపురం, రాజుపాలెంకు చెందిన క్షత్రియులు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పటు చేయనున్నారు. 12వ తేదిన ఈటమాపురంలో లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం, 13న నాయుడువారిపల్లిలో బ్రహ్మోత్సవం, 14న తూర్పుపల్లిలో బ్రహ్మోత్సవం, 16న రథోత్సవం, 17న పుష్పయాగం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా జయంత్యుత్సవాలు

వీరబల్లి: మండలంలోని పెదివీడు పంచాయతీలోని మాండవ్య నదిగుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం, రుద్రహోమం, నవగ్రహ హోమం, విష్ణుహోమం నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటలకు భక్త ప్రహ్లాద కళాబృందం వారితో నాటక పదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో ప్రజలు, భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ ధర్మకర్త కోరారు.

నేడు ఇంజినీరింగ్ విద్యపై అవగాహన సదస్సులు

చింతకొమ్మదిన్నె : రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రాయచోటి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఎన్జీవో హోం, మైదుకూరు పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ పక్కన ఉన్న శ్రీ లక్ష్మీచెన్నకేశవ ఫంక్షన్ హాలు, బద్వేల్ పట్టణం నెల్లూరు రోడ్డులోని నాగభూషణం మినీ ఫంక్షన్ హాలులో ఇంజినీరింగ్ విద్య పై అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సుదాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అవగాహన సదస్సుకు ఇంజనీరింగ్ కోర్సులలో చేరుటకు ఆసక్తిగల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని ఇంజనీరింగ్ విద్యపై అవగాహన పొంది ఉత్తమమైన, మంచి నాణ్యత, ప్రమాణాలు కలిగిన కళాశాలను ఎంచుకోవడంలో తగు నిర్ణయం తీసుకొని మీ బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు కల్యాణ మహోత్సవం

వీరపునాయునిపల్లె : మండలంలోని యరమలపల్లెలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణమహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటలకు ఆలయంలోని మూలమూర్తులతో పాటు ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందని 9.30 కల్యాణ మహోత్సవం, 12కు అన్న ప్రసాద వితరణ, 4కు గ్రామోత్సవం జరుగుతుందని ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.

వీర జవాన్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా జమ్మూ కశ్మీర్ యుద్ధ భూమిలో పోరాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మురళినాయక్ వీర మరణం పొందడం బాధాకరం అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, రైతు జిల్లా కన్వీనర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వీర మరణం పొందిన జవాన్ మురళినాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మైనూరారెడ్డి, మర్రి సుబ్బన్న, జెట్టి నగేష్, సునీల్‌రెడ్డి, శ్రీరాం రమణ, దాసరి సురేష్, చంద్రపాల్, చంటి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శనేశ్వరస్వామికి పూజలు



శనేశ్వరస్వామికి పూజలు చేస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు మేడా మధుసూదన్‌రెడ్డి

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో వెలసిన శ్రీ మందగిరి శనేశ్వరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి గణపతిపూజ, కలశ స్థాపన, పుణ్యాహావాచనం, క్షీరాభిషేకం, తైలాభిషేకం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి స్వామి వారికి తైలాభిషేకం పూజలు నిర్వహించారన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు మేడా మధుసూదన్‌రెడ్డి శనేశ్వర స్వామిని దర్శించుకొని తైలాభిషేకం పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా కలిశ స్థాపన పూజలు

మండలంలోని జీఎంజీ కళాశాలకు ఎదురుగా వెలసిన పెంచల లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం కలిశ స్థాపన పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి గణపతి పూజ, పుణ్యహావాచనం, గోపూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహ నరసింహ జపం, దీక్షా హోమం, అభిషేకం, తీర్థ ప్రసాదాలు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణ, దీక్షా హోమం, నవగ్రమ జపం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా శేష వాహన సేవ



వెయ్యినూతల కోనలో శేష వాహన సేవలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి

పెండ్లిమర్రి : వెయ్యినూతలకోన పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహహరిప్రసాద్, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా శేష వాహన సేవ నిర్వహించారు. ముందుగా ధ్వజారోహణము, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, శాంతి హోమం వంటి కార్యాక్రమాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు నరసింహస్వామి జయంతి

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, వేదపారాయనం, మహామంగళహారతి, సాయంత్రం హనుమత్ వాహనం వంటి కార్యాక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ప్రారంభమైన హరిహరాదుల బ్రహ్మోత్సవాలు



పూజలందుకుంటున్న మోక్ష నారాయణ స్వామి

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి, శ్రీ వల్లీదేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి వార్ల బ్రహ్మోత్సవాలు కనుల పండువగా ప్రారంభం అయ్యాయి. పుణ్య భూమి ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, ఆలయ ప్రధాన సేవకుడు సత్య సాయినాథశర్మ దంపతుల ఆధ్వర్యంలో శనివారం బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఉదయం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. మొదటి రోజు ఉదయం మహా గణపతిపూజ, పుణ్యావచనం, సంకల్ప అంకురార్పణ, ధ్వజా రోహణం, దీక్షా హోమం తదితర పూజాధికారాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం మోక్ష నారాయణస్వామిని హనుమద్వాహనంపై, సుబ్రమణ్యస్వామిని హంస వాహనంపై ఊరేగించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు విరివిగా హాజరై స్వామి వార్లను దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ప్రత్యే పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. అన్నదానం ఏర్పాటు చేశారు.